క్లుప్తంగా

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో జి.రామాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ముందుగా గణపతి పూజ అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. బుధవారాన్ని పురస్కరించుకుని భక్తులు అమ్మవారికి స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ప్రతి బుధవారం దొండపర్తి, అక్కయ్యపాలెం, రైల్వేన్యూకాలనీ, మద్దిలపాలెం, రేసపువానిపాలెం, నక్కవానిపాలెం, పెదవాల్తేరు, లలితానగర్, శంకరమఠం, సీతంపేట, రామాటాకీస్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి జలాభిషేకం చేయడం ఆనవాయితీ, సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి నిమజ్జనం



దుర్గాదేవికి పూజలు చేస్తున్న గ్రీన్‌పార్క్ ఆటో స్టాండ్ కార్మికులు

దాబాగార్డెన్స్: నగరంలోని గ్రీన్‌పార్క్ హోటల్ సమీపాన ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ముగిసాయి. నిమజ్జన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన జరిపారు. సాయంత్రం నిర్వహించిన నిమజ్జన కార్యక్రమంలో పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చారు. డప్పు వాయిద్యాల నడుమ నిమజ్జన ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రీన్‌పార్క్ ఆటో స్టాండ్ డ్రైవర్లు, పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొన్నారు.

శిశుగృహ పరిశీలన



శిశుగృహ వద్ద వేంకటశేషమ్మ తదితరులు

మద్రిపాలెం : డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ బుధవారం శిశుగృహను సందర్శించారు. అక్కడి పరిస్థితులను గమనించి, అందుతున్న సదుపాయాలు పరిశీలించారు. ఆమెతోపాటు ప్రాజెక్టు డైరెక్టర్ జి.జయాదేవి, మేనేజర్ ఎ.సుజాత, సోషల్ వర్కర్ ఎస్‌వీఎస్ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో సినిమా షూటింగ్



లొకేషన్‌లో హీరో నాగశౌర్య

కొమ్మాది: బీచ్‌రోడ్డులో హీరో నాగశౌర్య నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ జరిగింది. ఉప్పాడ, ఎంవీపీ కాలనీల్లో బుధవారం షూటింగ్ నిర్వహించినట్లు చిత్రం యూనిట్ సభ్యులు తెలిపారు. నాగశౌర్యపై ఇప్పటికే సింహాచలం, భీమిలి, ఆర్‌కే బీచ్ ప్రాంతాల్లో పలు సన్నివేశాలు చిత్రీకరించినట్లు చెప్పారు. భీమిలి-విశాఖ పరిసర ప్రాంతాల్లో మరో నాలుగు రోజులు పాటు ఈ సినిమా చిత్రీకరణ ఉంటుందన్నారు.

కొద్దిపాటి జాగ్రత్తలతో.. వ్యాధులకు చెక్

ఇటీవల తరచూ కురుస్తున్న వర్షాల కారణంగా ఎక్కడ చూసినా జ్వరాలు ప్రబలుతున్నాయి. అపారిశుధ్యం, అవగాహన లోపం వల్ల వ్యాధులు ప్రబలుతున్నాయని, కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధులను ఇట్టే కట్టడి చేయవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లతో వ్యాధులకు చెక్ పెట్టవచ్చంటున్నారు. ముఖ్యంగా పరిసరాల్లో నీరు నిల్వ ఉండరాదని, నిల్వ నీటిలో లార్వా పెరుగుదల లేకుండా చూసుకోవాలని స్పష్టం చేస్తున్నారు. అలా కొద్దిపాటి జాగ్రత్తలతో వ్యాధులను కట్టడి చేద్దాం.



దొండపర్తి యూపీహెచ్‌సీ

జగదాంబ: వ్యాధుల సీజన్ దాదాపు ముగుస్తున్నా ఇప్పటికీ జ్వరాలు తగ్గుముఖం పట్టడంలేదు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధుల గురించి ఎక్కువగా వినిపిస్తోంది. నియోజకవర్గ పరిధిలోని దాదాపు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ జ్వరాలు అధికంగా నమోదు అవుతున్నాయి. రోగుల తాకిడి ఆయా పీహెచ్‌సీలకు ఎక్కువగా ఉంటోంది. దొండపర్తి, అల్లిపురం, వన్‌టౌన్, ప్రసాద్‌గార్డెన్స్, కల్లుపాకలు తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు జ్వరపీడితులు అధికంగా వస్తున్నారు. జ్వరం, కాళ్లనొప్పులు, ఒంటి నొప్పులతో బాధపడుతూ బాధితులు ఆస్పత్రుల్లో వైద్యం తీసుకుంటున్నారు.

అవగాహనతో వ్యాధులు దూరం..

విజృంభిస్తున్న వ్యాధులను కట్టడి చేసేందుకు కొద్దిపాటి అవగాహన ముఖ్యమని వైద్యులు సూచిస్తున్నారు. సీజనల్ వ్యాధుల కాలంలో దోమల వల్ల ఒకరి నుండి ఒకరికి జ్వరాలు వ్యాపిస్తాయి కనుక వ్యాధుల నిర్మూలనకు దోమలను కట్టడి చేయాలని చెబుతున్నారు.

ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల కూడా వ్యాధులు విజృంభిస్తున్నాయని, దీని కట్టడికి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే కాల్వలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని, నీరు నిల్వ ఉండకూడదని చెబుతున్నారు. తాగి పడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు నివాసాలకు దగ్గరలో లేకుండా జాగ్రత్త పడాలంటున్నారు.

డ్రై డే

వారానికి ఒకసారి డ్రైడే పాటించడం ద్వారా మన పరిసరాలు పరిశుభ్రం అవుతాయి. ఆ రోజు డ్రైడే పాటించాలని వైద్యులంటున్నారు. ఆరోజు ఇల్లు, పరిసరాలను శుభ్రం చేసుకోవాలి. ఇంట్లో పనికి రాని వస్తువులు ఉంటే పడేయాలి. ఫ్రిజ్ వెనుక నిల్వ ఉండే నీటిని పరిశుభ్రం చేసుకోవాలి. అక్కడ వ్యాధులకు కారణమయ్యే దోమలు గుడ్లు పెట్టడం ద్వారా సంతానోత్పత్తి చేస్తాయి. తరచు తడిగా ఉండే ప్రాంతాలు డ్రైడే వల్ల శుభ్రపడతాయి. అపరిశుభ్రంగా ఉన్న చోట్ల బ్లీచింగ్ వంటివి చల్లటం ద్వారా అపారిశుధ్యం తొలగిపోతుంది.

మొక్కల పెంపకంలో జాగ్రత్తలు..

చాలా మంది మొక్కలు పెంచుతుంటారు. అయితే సరైన జాగ్రత్తలు మాత్రం తీసుకోరు. ప్లాస్టిక్ కుండీలు, సీసాల్లో కొన్ని రకాల మొక్కలు, వేర్లు పెంచుతుంటారు. అయితే ఆ కుండీలు, సీసాల్లో నీటిని మాత్రం రోజుల తరబడి మార్చరు. అటువంటి నీటిలోనే వ్యాధులు కలుగజేసే దోమలు వృద్ధి చెందుతాయి. కనుక కుండీల్లో నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలి. నిర్లక్ష్యం వహిస్తే ఒక్కో దోమ దాదాపు 200 వరకు గుడ్లు పెడితే ఆ గుడ్లు 12 రోజుల్లో దోమలుగా వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయి.

వ్యాధుల కట్టడి ఇలా..

- దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి
- వారానికి ఒకరోజు తప్పనిసరిగా ఇంటి పరిసరాల్లోని నీళ్ల కుండీలు, గోలాలు, ట్యాంకులు ఆరబెట్టుకోవాలి
- ఫ్రిజ్ వెనుక డ్రిప్ బాక్స్, కూలర్లు వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలి
- ఇంటి పరిసరాల్లో వర్షం నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- నీటిలో దోమ లార్వాలు ఉన్నట్లు గుర్తిస్తే ఆ నీటిని మట్టిలో కలిపేయాలి.
- దోమలు కుట్టకుండా శరీరాన్ని పూర్తిగా కప్పేలా దుస్తులు ధరించాలి.
- దోమతెరలు వాడితే దోమల నుండి రక్షణ లభిస్తుంది.



దొండపర్తి యూపీహెచ్‌సీలో రోగి బీపీ చూస్తున్న వైద్య సిబ్బంది

పేదలను ఆదుకోవాలి..



సీజనల్ వ్యాధులు ప్రబలు తున్నాయి. చాలా మంది జ్వరాలతో బాధపడుతున్నారు. గతంలో పీహెచ్‌సీ లలో వారమంతా ప్రత్యేక వైద్యులు ఉండి వైద్యం అందించేవారు. ఇప్పుడు ఆ సదుపాయం లేదు. ఇప్పుడు ఏ వ్యాధి వచ్చినా కేజీహెచ్‌కే వెళ్లాల్సి వస్తోంది. ఇంటి దగ్గరలో వైద్యం లేకుండాపోయింది. పేదల కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

– నాయిని నర్సమ్మ, కల్లుపాకలు, 35వ వార్డు.

పరిశుభ్రత లోపించింది..



తరచూ కురుస్తున్న వర్షాల నేపథ్యంలో దోమలు పెరిగి వ్యాధులకు కారణం అవుతున్నాయి. జీవీఎంసీ అధికారులు దోమలు ఉత్పత్తి అవకుండా చర్యలు తీసుకోవడం లేదు. బ్లీచింగ్ చల్లడంలేదు. పరిశుభ్రత లోపించింది. దీని వలన దోమలు ఎక్కువగా ఉంటున్నాయి. వ్యాధులు ప్రబలుతున్నాయి.

–రమణమ్మ, ప్రసాద్‌గార్డెన్స్, 35వ వార్డు

జాగ్రత్తలతోనే వ్యాధులకు చెక్..



తగిన జాగ్రత్తలతోనే వ్యాధులకు అడ్డుకట్ట పడుతుంది. ఇంట్లో జ్వరపీడితులు ఉంటే వారు తప్పనిసరిగా మాస్క్ ధరించాలి. అప్పుడు మిగతా వారికి ఆ వ్యాధి సోకదు. అలాగే కాచి చల్లార్చిన నీటిని తాగడం, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చు.

–డాక్టర్ శ్రావణి షారోన్, మెడికల్ ఆఫీసర్, దొండపర్తి యూపీహెచ్‌సీ

నర్సుల ఎన్నికల కోలాహలం



అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేస్తున్న ఉషారాణి

మహారాణిపేట: ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. కేజీహెచ్ క్లాక్ రూమ్‌లో నామినేషన్ల పర్వం కోలాహలంగా మారింది. అభ్యర్థుల నుంచి ఎన్నికల అధికారి బి. శ్రీనివాసరావు నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష పదవికి ఒక ప్యానల్ నుంచి ఉషారాణి నామినేషన్ దాఖలు చేశారు. ఆమెతో పాటు పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే ఇంకో ప్యానల్ నుంచి గంగాభవానీ అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేశారు. మొత్తం 9 పోస్టులకు గాను 19 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఒక్క సెక్రటరీ పోస్టుకి ముగ్గురు నామినేషన్ దాఖలు చేశారు. మిగిలిన అన్ని పోస్టులకు రెండేసి నామినేషన్లు వచ్చాయని ఎన్నికల అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 555 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో రెండు ప్యానళ్లు పోటీ పడుతున్నాయి. అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, వైస్ ప్రెసిడెంట్‌తో పాటు ఐదుగురు పాలకవర్గ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. 17న నామినేషన్ల పరిశీలన, 18న ఉపసంహరణ జరుగుతుంది. అనివార్యం అయితే ఈనెల 23న ఎన్నికలు నిర్వహించవలసి ఉంది.

సినీ దర్శకుడు ఆదిత్యతో ఇష్టాగోష్ఠి నేడు

భీమునిపట్నం: కళాసాహితీ ఆధ్వర్యంలో చిత్ర దర్శకుడు పి.సి.ఆదిత్యతో గురువారం ఇష్టాగోష్ఠి నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు పి. రాజేంద్రప్రసాద్ వర్మ, ఎ.సన్యాసిరాజు తెలిపారు. భీమిలి చిన్నబజారు శ్రీనివాస ఫంక్షన్ హాల్లో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. త్వరలో ఆదిత్య తీయనున్న చలన చిత్రంలో స్థానికులకు అవకాశం కల్పించనున్నారని, నటనపై ఆసక్తి గలవారు ఆయన్ను కలిసి వివరాలు అందించవచ్చని తెలియజేశారు.

నాలుగు రోజుల పాటు కేరళ ఆయిర్వేద శిబిరం



డాక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్

దాబాగార్డెన్స్: ఆయుర్వేద రంగంలో నిష్ణాతులైన ప్రముఖ అయుర్వేద వైద్యుడు డాక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్ నాలుగు రోజుల పాటు విశాఖలో అందుబాటులో ఉంటారని వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20, 21 తేదీల్లో రామ్‌నగర్‌లోని జీవీఎంసీ ఔట్‌గేట్ ఎదురుగా గల వైద్యరాజ ఔషధాలయంలో, 22, 23 తేదీల్లో మురళీనగర్ శ్రీదేవి పార్క్ సమీపంలో గల వైద్యరాజ్ కేంద్రంలోనూ డాక్టర్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఆయిర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందజేయనున్నట్లు దినూప్ తెలిపారు. చర్మవ్యాధులు, ఆర్థరైటీస్, సైనసైటిస్, సోరియాసిస్, ఒత్తిడి, ఈఎన్‌టీ సమస్యలు, హైపర్ టెన్షన్, కీళ్లవ్యాధులు, నడుంనొప్పి, స్పాండిలైటిస్, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య శిబిరంలో డాక్టర్ నాయర్ అందుబాటులో ఉండి చికిత్స అందజేయనున్నారని చెప్పారు. డాక్టర్‌ను సంప్రదించాలనుకునే వారు 8008000670, 7675861446 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రహదారులు జలమయం

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నీట మునిగిన పాతనగరం



ఆర్‌ఆర్‌ఎం రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు



వెలంపేట వద్ద నీట మునిగిన రహదారి

జగదాంబ: మంగళవారం రాత్రి నుంచి కురిసిన వర్షంతో పాతనగరంలో రహదారులు జలమయం అయ్యాయి. చిన్నపాటి వర్షం వస్తే ముడుకుల లోతు నీళ్లతో నిండిపోయే ఈ ప్రాంత రహదారులు బుధవారం ఉదయం, సాయంత్రం కురిసిన వర్షానికి నీట మునిగాయి. పోర్టు దరి హార్బర్ స్టేషన్ వద్ద రహదారి వర్షం నీటితో నిండిపోయింది. రామకృష్ణా జంక్షన్, 75 ఫీట్ రోడ్డు, జనతాబజార్ రహదారి, బౌడారారోడ్డు, పూర్ణామార్కెట్, వెలంపేట, పూర్ణామార్కెట్ జంక్షన్ ఇలా అన్ని రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి. వాహన చోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. వాహనాలు నీటిలోనే ఉండిపోయాయి. దీనికి తోడు ఎటు చూసినా చెత్తా చెదారాలు పేరుకుపోయి కనిపించాయి.



వర్షం నీటిలో బౌడారా రోడ్డు

లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేద్దాం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హేమ

ఎంవీపీకాలనీ: స్థానిక సమత డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం 'లైంగిక వేధింపులు' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి ఎంటర్ ప్రీమియర్ హెచ్‌ఆర్ కన్సల్టెంట్ డాక్టర్ హేమ మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. లైంగిక వేధింపుల ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రతి కళాశాల, సంస్థల్లో ప్రత్యేక వ్యవస్థలు ఉండాలని సూచించారు. ఆయా సంస్థలు అంతర్గతంగా ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులకు రక్షణ కల్పించడంతోపాటు వివరాలను గోప్యంగా ఉంచాలన్నారు. ఫిర్యాదుదారు స్వేచ్ఛగా తన సమస్యను తెలియజేసే వాతావరణం కల్పించాలని సూచించారు. లైంగిక వేధింపుల విషయంలో విద్యార్థినులు, మహిళలు కుంగిపోకుండా ధైర్యంగా వారి సమస్యను ప్రత్యేక వ్యవస్థ ముందుంచాలన్నారు. తద్వారా లైగింక వేధింపులకు అడ్డుకట్ట వేయాలని పిలుపునిచ్చారు. లైంగిక వేధింపులకు రాజ్యాంగం అందుబాటులోకి తెచ్చిన చట్టాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలని ధర్నా

ఆరిలోవ: సామాన్యులపై ఆర్థిక భారం పడుతున్న నిత్యావసర సరకుల ధరలను తగ్గించాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ జోన్ ఆరిలోవ ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ కూడలిలో ధర్నా చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ కూడలి నుంచి పాత ఆరిలోవ మీదుగా బాలాజీనగర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ తూర్పు నియోజకవర్గ కార్యదర్శి ఎస్.కె.రెహమాన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు క్షేత్రపాలు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సామాన్య, మధ్యతరగతి ప్రజలు జీవనం సాగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. నిత్యావసర సరకుల ధరలు పెంచి వారిపై మోయలేని ఆర్థిక భారం వేస్తోందని మండిపడ్డారు.

అద్భుతంగా త్రివేణీ స్వర సంగమం



కార్యక్రమానికి హాజరైన అతిథులు

దాబాగార్డెన్స్: నగరానికి చెందిన ముగ్గురు గాయనీమణులు నిర్వహించిన 'త్రివేణీ స్వర సంగమం' తెలుగు, హిందీ పాటలతో అలరించింది. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా బుధవారం సంస్థ వ్యవస్థాపకులు నారీ-భేరీ సమర్పణలో సీవీ రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, శైలజ మీరాజ్ ముగ్గురు గాయనీ మణులు సంయుక్తంగా ఆలపించిన తెలుగు, హిందీ గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని విశాఖ పోర్టు విశ్రాంత అధికారి హరినాథ్‌బాబు, డాక్టర్ ఉషా చీరాల, సన్‌మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ సాంస్కృతిక రంగానికి ప్రతిష్ట తెస్తున్న ముగ్గురు గాయనీమణులు అందిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీఆర్ నాగేశ్వరరావు, బంగారయ్య, పుండరీకుమార్, సురేష్ కన్నా, రాజు, రామ్, భూపతిరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ కరుణతోనే ఈ స్థాయికి వచ్చా

మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్



దుర్గమ్మ సన్నిధిలో వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: తల్లిదండ్రుల దీవెనలతో ఉన్నత ఉద్యోగం సాధించినప్పటికీ ఈ స్థాయికి ఎదగడానికి కనకదుర్గమ్మ కటాక్షమే కారణమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. 104 ఏరియాలో గల వైజాగ్ డిఫెన్స్ అకాడమీ, రామబాణం కళాశాల ప్రాంగణంలో దేవీ శరన్నవరాత్రుల నిమజ్జన ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. నవరాత్రుల ప్రత్యేక పూజలతో పాటు, నిత్య హోమం వైభవంగా జరిగింది. వాసుపల్లి గణేష్‌కుమార్, ఉషారాణి దంపతులు, కుమారుడు సూర్య, సౌందర్య రాశి దంపతులు, వాసుపల్లి మాతృమూర్తి అమ్మాజీ, చిన్న కుమారుడు సాకేత్, కళాశాల సిబ్బంది బుధవారం నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు. కనకదుర్గమ్మను ఆరాధిస్తూ ధూప దీప నైవేద్యాలతో పాటు అనేక రకాల పండ్లు, ఫలహారాలు, వివిధ రకాల స్వీట్లు అమ్మవారికి నివేదించారు. అనంతరం పూజలో పాల్గొన్న వారందరికీ ప్రసాదం అందజేశారు. మూడు దశాబ్దాలుగా దసరా ఉత్సవాలు చేస్తూ అమ్మవారిని క్రమం తప్పకుండా ఆరాధిస్తున్నామన్నారు. తనని రెండు సార్లు ఎమ్మెల్యేగా దీవించిన నియోజకవర్గ ప్రజలు ఎప్పుడు సుఖసంతోషాలతో అమ్మవారి కరుణా కటాక్షం ఉండాలని అభిలషించారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు సీఎంగా కోరుకుంటున్న జగనన్న 2025 జమిలి ఎన్నికల్లో అత్యధిక సీట్లతో ముఖ్యమంత్రి కాబోతున్నారని స్పష్టం చేశారు. వంద రోజులు గడిచినా ప్రజలకు ఏమీ చేయలేని కూటమి ప్రభుత్వం రూపాయి అవినీతి లేకుండా ప్రజలకు ఎన్నో పథకాలు నేరుగా వారి అకౌంట్లలో వేసి ఆదుకున్న జగనన్నపై దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, పలు వార్డుల నాయకులు పీతల వాసు, అలపన కనకరెడ్డి, లండా రమణ, దళమంతుల మాణిక్యాలరావు, ముజీబ్‌ఖాన్, సకలాభక్తుల ప్రసాద్, అమ్మాజీ, వడ్డాది దిలీప్, కోన శంకర్, భాను, గనగల్ల రామరాజు, చింతకాయల వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే...!

- నియోజకవర్గంలో పడకేసిన పారిశుధ్యం
- పట్టించుకోని జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ



సీతమ్మధార రైతుబజార్ వద్ద డంపర్‌బిన్ నిండిపోయి చెత్త బయట పడిన దృశ్యం



శ్రీనగర్ రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

సీతమ్మధార: నియోజకవర్గంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. దసరా సెలవులు ముగిసినా పారిశుధ్య సిబ్బంది జాడ కనిపించడం లేదని నియోజకవర్గ వాసులు మండిపడుతున్నారు. డంపర్‌బిన్లు నిండిపోయినా తరలించే నాథుడే కరువయ్యాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, గాంధీనగర్, టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ, 27వ వార్డు రామాటాకీస్, శ్రీనగర్ ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయింది. సీతమ్మధార, నార్త్ ఎక్స్‌టెన్సన్, బాలయ్య శాస్త్రి లే అవుట్, రాధాకృష్ణ లే అవుట్ ప్రాంతాల్లోనూ పారిశుధ్యం అధ్వానంగా తయారైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త పేరుకుపోవడంతో కుక్కలు చేరి చెల్లాచెదురు చేస్తున్నాయని, దోమలు స్వైర విహారం చేస్తున్నాయని వాపోతున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానిక నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హడలిపోతున్నారు. ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయని... శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు ఏం చేస్తున్నారో తెలియడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ – 3 ప్రజారోగ్యశాఖ అధికారులు స్పందించి పారిశుధ్య సిబ్బందితో చెత్త తరలించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.



శ్రీనగర్‌లో డంపర్‌బిన్ నిండిపోయి కిందపడిన వ్యర్థాలు

చేతుల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



చేతుల పరిశుభ్రత అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సీతమ్మధార : చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ఆరోగ్యం కాపాడుకోవచ్చని మేజిక్ బస్ సంస్థ ట్రైనింగ్ కమ్ మోనిటరింగ్ ఆఫీసర్ సురేంద్ర అన్నారు. గ్లోబల్ హ్యాండ్‌వాష్ డేను పురస్కరించుకుని పీ అండ్ టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ (ఎన్ఎంసీహెచ్)లో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనం ముందు, తర్వాత... వాష్ రూమ్‌కి వెళ్లిన తర్వాత, ఆటలు ఆడిన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. చేతులు అపరిశుభ్రంగా ఉంటే బ్యాక్టీరియా కడుపులోకి వెళ్లి పలు రోగాలకు కారణమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పైడి, పడమ్మలు, ప్రధానోపాధ్యాయుడు రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.